మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
TGBIL/25/A0512
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం
19 నవంబర్ 2026
పేజీలు : 6
@mvaartanews
www.mivaartanews.com

సంస్కృతి సంప్రదాయాల పరిమళంతో బంజారా వనమహోత్సవం.

- ఈ నెల 22న రఘునాథపాలెంలో అంగరంగ వైభవంగా వనమహోత్సవ వేడుకలు.

- బంజారాల వనసమారాధన మహోత్సవ కన్వీనర్ పోరిక లచ్చిరాం నాయక్.

ఖమ్మం నవంబర్ 18 మీ వార్త ప్రతినిధి:

కుల బంధాల ఆత్మీయతను చాటుతూ తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని భావితరాలకు అందిస్తూ.. బంజారా జాతి ఐక్యతకు ప్రతీకగా నిలిచేలా ఈ నెల 22న ఆదివారం బంజారాల వన సమారాధన మహోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ కన్వీనర్ పోరిక లచ్చిరాం నాయక్ తెలిపారు. పార్టీలు, వర్గాలు, సంఘాలకు అతీతంగా బంజారా కుటుంబాలన్నీ ఒకే కుటుంబంలా కలిసిమెలిసి ఆనందంగా గడిపేలా ఈ మహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రఘునాథపాలెంలోని నాగమ్మ గుడి ఎదురుగా ఉన్న ఆర్జీబీ మామిడి తోటలో ఈ వేడుకలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా నలుమూలల నుంచి బంజారా కుటుంబాల సభ్యులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, కార్మికులు, కర్షకులు, కళాకారులు, వైద్యులు, ఇంజనీర్లు, న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు కుటుంబ సమేతంగా తరలివచ్చి మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన ఆహ్వానించారు. ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. బంజారా జాతి ఐక్యత, అభివృద్ధి, సంక్షేమంతో పాటు విశిష్టమైన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయాలనే గొప్ప సంకల్పంతో ఈ వన సమారాధనకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. నేటి బిజీ జీవితాల్లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆత్మీయులు కలిసి మనసారా మాట్లాడుకునే అవకాశాలు తగ్గుతున్న నేపథ్యంలో.. జాతి మొత్తాన్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చి అనుబంధాలను మరింత బలోపేతం చేయడమే ఈ వేడుక ప్రధాన ఉద్దేశమని వివరించారు.నీతి, నిజాయితీ, కష్టపడి జీవించే తత్వానికి ప్రతీకగా నిలిచే బంజారా జాతి గొప్పతనాన్ని చాటేలా సంప్రదాయ కళలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. బంజారా నృత్యాలు, నెమలి నాట్యం, బిందెలతో చేసే సంప్రదాయ నృత్యాలు, కళాకారుల డప్పు వాయిద్యాలు, ఆటపాటలు, ఆనందోత్సాహాల నడుమ రోజంతా ఉత్సవ వాతావరణం నెలకొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు.పిల్లలు తమ జాతి మూలాలను, పెద్దలు తమ సంస్కృతి వైభవాన్ని మరోసారి గుర్తుచేసుకునేలా.. యువత సంప్రదాయాల గొప్పతనాన్ని తెలుసుకునేలా ఈ మహోత్సవం నిలవనుంది. కుటుంబాల మధ్య ఆప్యాయతలు పెంపొందిస్తూ, ఆత్మీయ పలకరింపులు, అనుబంధాల కలయికతో ప్రతి ఒక్కరికీ మధుర జ్ఞాపకాలను అందించాలనే లక్ష్యంతో కమిటీ సభ్యులు రాత్రింబవళ్లు శ్రమిస్తూ విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ వేడుకను ఒక సంఘానికి లేదా ఒక వర్గానికి పరిమితం చేయకుండా యావత్ బంజారా జాతి కుటుంబ సమ్మేళనంగా నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ తమ సొంత ఇంటి పండుగగా భావించి తరలిరావాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. బంజారా జాతి ఐక్యతను చాటుతూ, రాబోయే తరాలకు సంస్కృతి సంప్రదాయాల వారసత్వాన్ని అందించే ఈ మహోత్సవాన్ని అందరి భాగస్వామ్యంతో చిరస్మరణీయంగా నిలపాలని పిలుపునిచ్చారు.ఈ విలేకరుల సమావేశంలో కో,కన్వీనర్లు భూక్యా మంగ్య నాయక్, మాలోత్ రామారావు నాయక్, కోశాధికారులు డాక్టర్ మంగీలాల్ జాదవ్, గంగావత్ రమేష్ నాయక్, కార్యదర్శులు భూక్యా శోభన్ నాయక్, భూక్యా చంద్రు నాయక్, వి. తిరుపతి నాయక్, గౌరవ సలహాదారులు మూడ్ బాల్ సింగ్ నాయక్, ధరంసోత్ చక్రవర్తి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా శ్రీ ధన్వంతరి జయంతి ఉత్సవాలు
సామాజిక, శాస్త్రీయ అవగాహన ప్రచారకులకు ఘన సత్కారం

కొత్తగూడెం నవంబరు 18 మీ వార్త ఆర్ సి

హైదరాబాద్‌లోని నాంపల్లి సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో శ్రీ ధన్వంతరి పరివార్ ఆధ్వర్యంలో శ్రీ ధన్వంతరి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపకులపతి డాక్టర్ విష్ణుకాంత్ ఎన్. చెట్రుపల్లి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి శ్రీ ధన్వంతరి పరివార్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సూర్యపల్లి సారంగపాణి అధ్యక్షతవహించారు.ముఖ్య అతిథి మాట్లాడుతూ భారతీయ వైద్యవిధానమైన ఆయుర్వేదానికి విశిష్టమైన చరిత్ర, ప్రాధాన్యత ఉందని, ఆరోగ్యపరిరక్షణలోప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు సామాజిక ఐక్యత, సేవా భావం, మానవతా విలువలనుపెంపొందించుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు, వైద్య విద్యలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు, వైద్య విద్య పూర్తిచేసిన వైద్యులు, సూపర్ స్పెషలిటీ వైద్యులను ఘనంగా సన్మానించారు.కార్యక్రమానికి ముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులనుఅలరించాయి.కార్యక్రమంలో రిటైర్డ్ పోలీస్ అధికారి దుగ్యాల అశోక్ పారిశ్రామికవేత్త రాంబాబు, వ్యాపారవేత్త ప్రభాకర్, నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, కవి, సాహితి వేత్త తూముల శ్రీనివాస్





శ్రీ ధన్వంతరి జయంతి ఉత్సవాల సందర్భంగా సామాజిక సేవాకార్యక్రమాలతో పాటు ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం, విజ్ఞాన అవగాహన పెంపొందించేందుకు కృషి చేస్తున్న నోపా

అధ్యక్షులు వై.కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షులు లింగంపల్లి దయానంద్‌లను నిర్వాహకులు ఘనంగా సన్మానించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కవి సాహితీవేత్త తూముల శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలోసేవాకార్యక్రమాలు నిర్వహించే వ్యక్తులను, ప్రజల్లో చైతన్యం కలిగించే సామాజిక కార్యకర్తలను గుర్తించి గౌరవించడం ఎంతో గొప్ప విషయమనిఅన్నారు. సమాజంలో శాస్త్రీయ ఆలోచన, విజ్ఞాన ప్రచారం, ఆరోగ్య అవగాహన, మానవతా విలువలనుపెంపొందించేందుకు కృషి చేసే వారి సేవలకు తగిన గుర్తింపు లభించినప్పుడు మరింత మందిసామాజికసేవారంగంలో ముందుకు వస్తారని అభిప్రాయపడ్డారు. ధన్వంతరిజయంతిఉత్సవాల సందర్భంగా సామాజిక చైతన్యానికి కృషి చేస్తున్న కృష్ణప్రసాద్,దయానంద్‌లనుసత్కరించడం అభినందనీయమని పేర్కొన్నారు.సత్కారం అందుకున్న వై. కృష్ణప్రసాద్, లింగంపల్లి దయానంద్ మాట్లాడుతూ తమ సామాజిక సేవలను గుర్తించి గౌరవించిన శ్రీ ధన్వంతరిపరివార్ నిర్వాహకులకు,వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సూర్యపల్లి సారంగపాణికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో శాస్త్రీయ ఆలోచనలనుపెంపొందించడం, ప్రజల్లో అవగాహన కల్పించడం, సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాలుకొనసాగించడం తమ లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ సత్కారం తమకు మరింత బాధ్యతతో ప్రజాసేవలో ముందుకు సాగేందుకుప్రేరణనిస్తుందని, ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం, ఆరోగ్య అవగాహన, సామాజిక చైతన్యంపెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

జేవీఆర్ ఓసీ నూతన ప్రాజెక్ట్
ఆఫీసర్ సునీల్ వర్మకు ఘన సన్మానం

- శాలువా, పూల బొకేతో స్వాగతం పలికిన ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు

సత్తుపల్లి నవంబర్ 18 మీ వార్త టౌన్ రిపోర్టర్

సత్తుపల్లి జేవీఆర్ ఓపెన్‌కాస్ట్ (జేవీఆర్ ఓసి)కు కిష్టారం ఓపెన్‌కాస్ట్ నుంచి బదిలీపై నూతనంగా విచ్చేసిన ప్రాజెక్ట్ ఆఫీసర్ సునీల్ వర్మకు ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు ఘన స్వాగతం పలికారు.జేవీఆర్ ఓసీ పిట్ సెక్రటరీ సీతారామరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు ప్రాజెక్ట్ ఆఫీసర్ సునీల్ వర్మను శాలువాతో సత్కరించి, పూల బొకే అందజేశారు.ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ.. సునీల్ వర్మ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. జేవీఆర్ ఓసీలో కార్మికుల సంక్షేమం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, బొగ్గు ఉత్పత్తి మరియు ఉత్పాదకతను మరింత మెరుగుపరిచే దిశగా కృషి చేయాలని కోరారు. అనంతరం ప్రాజెక్ట్ ఆఫీసర్ సునీల్ వర్మ మాట్లాడుతూ.. కార్మికులందరూ రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా బొగ్గు నాణ్యత విషయంలో ప్రతి ఒక్కరూ సమన్వయంతో, కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కార్మికులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వాటి పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.తనకు ఘన స్వాగతం పలికి సన్మానించిన ఐఎన్టీయూసీ నాయకులకు, కార్మిక ప్రతినిధులకు ఈ సందర్భంగా సునీల్ వర్మ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ మురళీకృష్ణ, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ పొట్టి కిరణ్, బ్రాంచ్ ట్రెజరర్ సుదర్శన్, అసిస్టెంట్ సెక్రటరీలు శ్రీధర్, రాంప్రసాద్, కనకయ్య,నాగేశ్వరరావు,ఇక్బాల్, శ్రీధర్,రాజేందర్, శ్రీకాంత్,సతీష్,చాంద్, కిషన్ రావు,చంద్రశేఖర్,అజాజ్, నాగార్జున,షరీఫ్,గౌస్, రాంబాబు, బుల్లెట్ సురేష్,రాము, తిరుమల్ రావు,కొంకటి కుమార్, చెరుకు రాజు,ఆవుల శ్రీను, రాజయ్య, రమేష్ భూక్య, కొమరయ్య, కృష్ణ, యోసేబ్ తదితరులు పాల్గొన్నారు.



పీఏడిపై డయాబెటిస్ బాధితులకు అవగాహన అవసరం.

- అవగాహన చికిత్స లేకుంటే కాలు పోయే ప్రమాదం- డా. శ్రీకాంత్ రాజు.

ఖమ్మం నవంబర్ 18 మీ వార్త ప్రతినిధి:



డయాబెటిస్ రోగుల్లో కాళ్లకు రక్తప్రసరణ తగ్గడం పిఏడి పై అవగాహన అత్యవసరమని సీనియర్ కన్సల్టెంట్ వాస్కులర్ సర్జన్ ఎండోవాస్కులర్ సర్జన్, క్లినికల్ డైరెక్టర్ యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ యూనిట్ డా.ఎస్ శ్రీకాంత్ రాజు అన్నారు. ఖమ్మం లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డయాబెటిస్ ఉన్న వారిలో పిరిఫెరల్ ఆర్టీరియల్ డిసీజ్ పిఏడి సమస్య వేగంగా పెరుగుతోందని, డయాబెటిస్ రోగుల్లో ఈ సమస్య తీవ్రంగా ఉండి, చిన్న గాయాలు కూడా మానకుండా పుండ్లుగా మారే ప్రమాదం ఉందన్నారు. నరాల సమస్య కారణంగా కొందరిలో నొప్పి తెలియకపోవచ్చని హెచ్చరించారు. నడిచేటప్పుడు కాళ్లలో నొప్పి, కాళ్లు త్వరగా అలసిపోవడం, పాదాలు చల్లగా ఉండటం,మానని గాయాలు, వేళ్లు నల్లబడటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. సకాలంలో కాళ్ల రక్తపోటు పరీక్ష, డాప్లర్ స్కాన్ వంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యను ముందే గుర్తించి చికిత్స చేయవచ్చన్నారు. డయాబెటిస్ రోగులు రక్త చక్కెరను కట్టుదిట్టంగా నియంత్రించుకోవాలని, పొగతాగడం పూర్తిగా మానాలని, అవసరమైతే మందులు లేదా యాంజియోప్లాస్టీ వంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రోజు పాదాలను పరిశీలించడం, గాయాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య సలహా తీసుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు. ముందస్తు అవగాహన, సకాలంలో చికిత్సతో కాలు కోల్పోయే ప్రమాదాన్ని పూర్తిగా నివారించవచ్చని డా. శ్రీకాంత్ రాజు స్పష్టం చేశారు. కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ మేనేజర్లు శ్రీకాంత్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడే అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు.

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్య నారాయణ గౌడ్.

ఖమ్మం నవంబర్ 18 మీ వార్త ప్రతినిధి:



జిల్లా కాంగ్రెస్ కార్యాలయం అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ అన్నారు. మంజూరైన పింఛన్లకు సంబంధించి ఈ నెల 19న నవంబర్ నెలకు సంబంధించిన నగదును నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు.అర్హత ఉండి పింఛన్ మంజూరు కాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. అర్హులైన వారు సంబంధిత మున్సిపల్ కార్యాలయం లేదా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందించడంతోపాటు, నిరంతరం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించడం, వాటిని విచారించి అర్హత ఉన్నవారికి మంజూరు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ విధానమని అన్నారు. ఖమ్మం జిల్లాలో అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలని ఆకాంక్షించారు. పింఛన్ పొందుతున్న లబ్ధిదారుడు మరణిస్తే, కుటుంబంలో అర్హులైన భార్య లేదా భర్తకు ఎలాంటి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేకుండా వెంటనే పింఛన్ మంజూరు చేసే విధానం తమ ప్రభుత్వంలో అమలులో ఉందని తెలిపారు. ఇప్పటికే చేయూత పింఛన్లు మంజూరైన లబ్ధిదారులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.అదే విధంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజాదరణ పొందుతున్న ప్రభుత్వంపై బీ ఆర్ ఎస్ నాయకులు బురదజల్లటం వారి అవివేక రాజకీయానికి, దిగజారుడు రాజకీయానికి మండిపడ్డ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్.

కామేపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన డిప్యూటీ డైరెక్టర్





కామేపల్లి, నవంబర్ 18 మీ వార్త ప్రతినిధి:

కామేపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఖమ్మం డిప్యూటీ డైరెక్టర్ ఫిరంగి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థినిలను సబ్జెక్టుల వారీగా సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు.ఉత్తమ ఫలితాల సాధనకు ఇప్పటి నుండే కృషి చేయాలని విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులను కోరారు. అనంతరం వంటశాల, ఆఫీస్ రూం, పాఠశాల పరిసరాల ను పరిశీలించారు.
ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రఘునాథ్, మ్యాట్రిన్ స్వర్ణలత, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్. కొత్తగూడెంలో 58 మందికి నూతన పింఛన్లు మంజూరు

- సర్పంచ్ తుర్రం రవికుమార్ చేతుల మీదుగా మంజూరు పత్రాల పంపిణీ



చర్ల, నవంబర్ 18: మీ వార్త ప్రతినిధి

చర్ల మండలం ఆర్. కొత్తగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా పింఛన్లు మంజూరైన 58 మంది లబ్ధిదారులకు బుధవారం పింఛన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ తుర్రం రవికుమార్ లబ్ధిదారులకు స్వయంగా మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు కనితి రజిని, కారం సుధాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. పేద ప్రజల కన్నీళ్లు తుడవడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. చర్ల మండల పరిధిలోని ఆర్. కొత్తగూడెం గ్రామ పంచాయతీ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు.

ప్రజా ప్రభుత్వం సన్న వడ్లకు రూ.500 బోనస్, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, పేదల సొంతింటి కలను నెరవేర్చే ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు. అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు కావడం సంతోషకరమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ తుర్రం రవికుమార్, ఉపసర్పంచ్ కాపుల కృష్ణార్జున్ రావు, పంచాయతీ కార్యదర్శి శోభారాణి, వార్డు సభ్యులు కనితి రజిని, కారం సుధాకర్, ఏలేసు, చింతకాయల రవీందర్, చింతకాయల స్వరూప, పూజారి సంధ్య తదితరులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టేకుల తండా గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీడీవో

ఆదర్శవంతంగా పాఠశాల ఉపాధ్యాయుల పనితీరు

ప్రశంసనీయం ఆదర్శ ఉపాధ్యాయుడు సపావట్ కిషన్ ను అభినందించిన ఎంపీడీవో సోంలాల్





కామేపల్లి, నవంబర్ 18 మీ వార్త ప్రతినిధి :

కామేపల్లి మండలం టేకుల తండా ప్రభుత్వ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను ఎంపీడీవో ధరావత్ సోంలాల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులను పాఠ్యాంశాలను చదివించారు.నోటు పుస్తకాలను పరిశీలించి విద్యార్థుల ప్రగతి పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాల ఆదర్శవంతంగా ఉందని,ఉపాధ్యాయుల పనితీరు ప్రశంసనీయమన్నారు.

పాఠశాల తరగతి గదులు, టి ఎల్ ఎం మెటీరియల్ తో చక్కగా అలంకరించబడడం, పాఠశాల బయట జాతీయ నాయకుల చిత్రపటాలు, బంజారా జాతి సంస్కృతి సాంప్రదాయాల చిత్రాలను చూసి ఆనంద భరితులై ఆదర్శ ఉపాధ్యాయులు సపావట్ కిషన్ ను ప్రత్యేకంగా అభినందించారు.మధ్యాహ్న భోజనం వంట తయారీ ప్రక్రియను పరిశీలించారు. పాఠశాల ఆవరణంలో ఇంకుడు గుంట నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. అందుకు సంబంధించిన పనులను కూడా సత్వరమే ఆరంభించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ జరపలా రెడ్డి, ఉపసర్పంచ్ లకావత్ నందా,పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. వీరన్న,ఉపాధ్యాయులు ఎం.రాజా,ఆదర్శ ఉపాధ్యాయులు ఎస్.కిషన్, ఏపీఓ ఏ.శ్రీ రాణి, పంచాయతీ కార్యదర్శి కె. విజయ,టెక్నికల్ అసిస్టెంట్ ఏ.బావుసింగ్, ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్. కోటేశ్వరరావు,పంచాయతీ సిబ్బంది హాథిరామ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉసిరికాయలపల్లి ఆశ్రమ పాఠశాలలో డీడీ ఆకస్మిక తనిఖీ

కారేపల్లి, నవంబర్ 18 : మీ వార్త ప్రతినిధి



సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాల ఏ హెచ్ ఎస్ ను ఖమ్మం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం. ఫిరంగి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందస్తు సమాచారం లేకుండా పాఠశాలను సందర్శించిన ఆయన పాఠశాలలో విద్యా బోధన, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, పాఠశాల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తనిఖీలో భాగంగా ముందుగా పాఠశాలలోని తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో నేరుగా ముఖాముఖి మాట్లాడారు. తరగతుల్లో విద్యార్థుల అభ్యసన తీరును తెలుసుకోవడంతో పాటు పాఠ్యాంశాలపై వారికి ఉన్న అవగాహన గురించి ఆరా తీశారు.చదువులో ఎదురవుతున్న ఇబ్బందులు, విద్యా సంబంధిత సమస్యలు, అవసరమైన సదుపాయాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న భోజన సదుపాయాలు, వంటశాల నిర్వహణకు సంబంధించిన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధర్మా,సీనియర్ ఉపాధ్యాయులు, డిప్యూటీ వార్డెన్ గోపి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఆరు కిలోమీటర్ల విద్యార్థుల కష్టాలకు ఆటోతో పరిష్కారం.. మానవత్వం చాటిన ఇద్దరు ఉపాధ్యాయులు!

- 18 మంది విద్యార్థుల చదువుకు అండగా నిలిచిన కనితి శ్రీను, శ్యామల నాగరాజు

చల్ల నవంబర్ 18 మీ వార్తా ప్రతినిధి

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పడమే కాదు.. వారి కష్టాలను తమ కష్టాలుగా భావించి, పరిష్కారం చూపడంలోనూ ఉపాధ్యాయులు ముందుంటారని నిరూపించారు ఇద్దరు ఆదర్శ ఉపాధ్యాయులు. ప్రతిరోజూ ఆరు కిలోమీటర్లు నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లే విద్యార్థుల ఇబ్బందులను గమనించి, వారి ప్రయాణ భారాన్ని తగ్గించేందుకు ఆటో సౌకర్యాన్ని ఏర్పాటు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

వెంకటచెరువు గ్రామానికి చెందిన 18 మంది విద్యార్థులు చదువుల కోసం ఉంజుపల్లి పాఠశాలకు ప్రతిరోజూ సుమారు ఆరు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో చిన్నారులు ప్రతిరోజూ నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లడం, తిరిగి ఇళ్లకు చేరుకోవడం ఎంతో ఇబ్బందికరంగా మారింది. ముఖ్యంగా ఎండ, వానలతో పాటు ఇతర ప్రతికూల పరిస్థితుల్లోనూ చిన్నారులు పడుతున్న ప్రయాణ కష్టాలు ఇద్దరు ఉపాధ్యాయుల మనసును కదిలించాయి.

విద్యార్థుల ఇబ్బందులను చూసి చలించిపోయిన ఉపాధ్యాయులు కనితి శ్రీను, శ్యామల నాగరాజు తమవంతు సహాయం అందించాలని నిర్ణయించుకున్నారు. పిల్లల చదువుకు ప్రయాణం అడ్డంకి కాకూడదనే మంచి ఉద్దేశంతో ఇద్దరూ కలిసి ఆటో సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ప్రతిరోజూ ఆరు కిలోమీటర్లు నడవాల్సిన 18 మంది విద్యార్థులకు ప్రయాణ కష్టాలు తగ్గి, సురక్షితంగా పాఠశాలకు చేరుకునే అవకాశం కల్పించారు.





సాధారణంగా ఉపాధ్యాయులు తరగతి గదిలో పాఠాలు బోధిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తారు. కానీ ఈ ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రం తరగతి గది దాటి విద్యార్థుల జీవితాల్లో ఎదురవుతున్న సమస్యను గుర్తించి, దానికి ఆచరణాత్మక పరిష్కారం చూపడం విశేషం. విద్యార్థులు బాగా చదువుకోవాలి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాఠశాలకు హాజరుకావాలనే తపనతో వారు చేసిన ఈ ప్రయత్నం అభినందనీయం.

విద్యార్థుల పట్ల ప్రేమ, బాధ్యత, సమాజం పట్ల సేవాభావం కలిసినప్పుడే ఇలాంటి మంచి కార్యక్రమాలు సాధ్యమవుతాయి. తాము చేసిన సహాయం గురించి ప్రచారం కోరుకోకుండా, చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు చూడటమే లక్ష్యంగా ముందుకొచ్చిన ఈ ఉపాధ్యాయుల సేవా స్ఫూర్తి నిజంగా ప్రశంసనీయం. వారు ఏర్పాటు చేసింది కేవలం ఒక ఆటో మాత్రమే కాదు.. 18 మంది విద్యార్థుల చదువుకు భరోసా, వారి బాల్యానికి భద్రత, భవిష్యత్తుకు వెలుగుబాట.

ఉపాధ్యాయ వృత్తికి మరింత గౌరవం తీసుకొచ్చిన కనితి శ్రీను, శ్యామల నాగరాజు ను వెంకటచెరువు గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు హృదయపూర్వకంగా అభినందిస్తున్నారు.

ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని, ప్రతి విద్యార్థికి విద్య అందుబాటులో ఉండేలా సమాజంలోని ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యత తీసుకోవాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దడమే నా ధ్యేయం అర్హులకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం సర్పంచ్ ఉమా నరేష్

కారేపల్లి: నవంబర్ 18 మీ వార్త ప్రతినిధి

మండలంలో మాదారం గ్రామపంచాయతీ ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడమే నా ధ్యేయమని అర్హులకే సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని మాదారం గ్రామ సర్పంచ్ అజ్మీర ఉమా నరేష్ అన్నారు.మండల పరిధిలోని మాదారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో 48 మంది లబ్ధిదారులకు చేయూత పింఛన్లు 11 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను ఎంపీడీవో బి పద్మ గ్రామ సర్పంచ్ అజ్మీర ఉమా నరేష్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పదేళ్లుగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హుల ఆశలను ఇందిరమ్మ ప్రభుత్వం నెరవేర్చిందని, పేదలు, వృద్ధులు, దివ్యాంగుల జీవితాల్లో సంక్షేమ పథకాలు వెలుగులు నింపుతున్నాయని మాదారం సర్పంచ్ ఉమా నరేష్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తూ, ప్రజలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. గతంలో ఏళ్ల తరబడి పింఛన్ల కోసం ఎదురుచూసిన వారికి నేడు ప్రభుత్వం అండగా నిలవడం ఎంతో సంతోషకరమన్నారు. పేద కుటుంబాలకు నెలవారీ పింఛన్ ఆర్థిక భరోసా కల్పిస్తోందని, ఇందిరమ్మ ఇళ్ల పథకం సొంత ఇంటి కలను సాకారం చేస్తోందని తెలిపారు. మాదారం గ్రామపంచాయతీకి ఇప్పటివరకు సుమారు 55 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించడం గ్రామ అభివృద్ధి పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.ఎంపీడీవో బి.పద్మ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. చేయూత పింఛన్లు పొందుతున్న దివ్యాంగులు తమ సదరం సర్టిఫికెట్ గడువు, రెన్యువల్ తేదీలను గుర్తుంచుకుని ప్రతి సంవత్సరం మీ సేవ కేంద్రాల్లో పునరుద్ధరణ చేసుకోవాలని సూచించారు. సకాలంలో రెన్యువల్ చేసుకుంటేనే పింఛన్లు నిరంతరంగా పొందేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా గ్రామస్థాయిలో కృషి చేస్తామని మాజీ సర్పంచ్ అజ్మీర నరేష్ తెలిపారు. గ్రామ పంచాయతీ అభివృద్ధిలో రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నామన్నారు. త్వరలో మాదారం విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం సిసి రహదారి పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్,ఉపసర్పంచ్ మంగా లాలు, కిలారి లక్ష్మి, బట్టు నరసయ్య, కుర్ర శ్రీనివాసరావు గుర్రం నరసయ్య, కిలారి అప్పారావు,కాసాని లక్ష్మీనారాయణ, కోయల శ్రీనివాస్, తుమ్ముజు రామమూర్తి, తన్నీరు మధుసూదన్, బాలాజీ వార్డు నెంబర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





రేకుల షెడ్డులో నివాసం- ఇందిరమ్మ ఇల్లు ఇవ్వండి

- ఇల్లు మంజూరు కాలేదని కలెక్టర్కు ఫిర్యాదు

- నిరుపేద కుటుంబం అవేదన

కారేపల్లి నవంబర్ 18 మీ వార్త ప్రతినిధి

రేకుల షెడ్లు నివసిస్తున్న నిబంధనలకు అనుగుణంగా ఎల్ వన్ క్యాటగిరి లో ఉన్న మాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని మా కుటుంబానికి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు మోకాళ్ళ రమేష్ తెలిపారు. మండల కేంద్రమైన కారేపల్లి లో గల తుడుం దెబ్బ కార్యాలయం నందు బుధవారం బాధితుడు మోకాళ్ళ రమేష్ మాట్లాడుతూ...మండల కేంద్రమైన కారేపల్లితుడుం దెబ్బ కార్యాలయంలో బుధవారం మోకాళ్ళ రమేష్ విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని చిన్నమడంపల్లి గ్రామపంచాయతీ పరిధి మోకాళ్ల రామయ్య గుంపు గ్రామానికి చెందిన తమ కుటుంబం కొంతకాలంగా రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నట్లు తెలిపారునిరుపేద కుటుంబమైన తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైతే కష్టాలు తీరుతాయని ఆశించామని తెలిపారు.తొలి జాబితాలో తమ ఇంటి



వెరిఫికేషన్ జరగడంతో ఇల్లు వస్తుందని ఎంతో ఆశపడ్డామని,చివరకు మంజూరు కాకపోవడంతో నిరాశ చెందామని పేర్కొన్నారు. ఇంటి మంజూరు విషయమై సర్పంచ్ భర్తను సంప్రదించగా..రూ.50 వేలు ఇస్తేనే ఇల్లు మంజూరవుతుందని, పైస్థాయి అధికారులకు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పినట్లు రమేష్ ఆరోపించారు.దీంతో తాను ఆయన వ్యక్తిగత ఫోన్‌పేకు రూ.5 వేలు పంపించినట్లు తెలిపారు. అయినప్పటికీ ఐటీడీఏ కోటాలో తమకు ఇల్లు మంజూరు కాలేదని,దీంతో తాను మోసపోయినట్లు భావించి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.ఈ ఆరోపణలకు సంబంధించి ఫోన్‌పే లావాదేవీల వివరాలు, వాయిస్ రికార్డింగ్ తమ వద్ద ఉన్నాయని తెలిపారు.

రేకుల షెడ్డులో జీవనం సాగిస్తున్న తమలాంటి నిరుపేదలకు ప్రభుత్వ పథకం ద్వారా ఇల్లు మంజూరు కావాల్సిన అవసరం ఉందని రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు.తన ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టి, ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.తమ కుటుంబ ఆర్థిక పరిస్థితిని, ఇంటి అర్హతను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌ను వేడుకున్నారు.స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ సైతం తమ కుటుంబ పరిస్థితిని గుర్తించి ఇల్లు మంజూరుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో తుడుం దెబ్బ రాష్ట్ర కోశాధికారి కల్తీ రాంప్రసాద్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, పూణెం శివరాం, సంక్షేమ పరిషత్తు వర్కింగ్ ప్రెసిడెంట్ వట్టం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నెమలిపురి తండా పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన మండల స్పెషల్ ఆఫీసర్

- విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి మెనూ అమలు తనిఖీ

- పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయుల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం

కామేపల్లి,నవంబర్ 18 మీ వార్త ప్రతినిధి :

కామేపల్లి మండలం నెమలిపురి తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్యక్రమం అమలు, పాఠశాల నిర్వహణ , ఉపాధ్యాయుల పనితీరు సంతృప్తికరంగా ఉందని కామేపల్లి మండల స్పెషల్ ఆఫీసర్ పోలిశెట్టి అజయ్ కుమార్ అన్నారు. బుధవారం ఆకస్మికంగా నెమలిపురి తండ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను, మూత్రశాలలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. మధ్యాహ్నం భోజనం కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తద్వారా మెనూ అమలును పర్యవేక్షించారు.పాఠశాల విద్యార్థుల హాజరు శాతం 97.3% (37 / 36)అయినందుకు సంతృప్తి ని వ్యక్తపరిచారు.పాఠశాల నిర్వహణ,ఉపాధ్యాయుల పనితీరు,పిల్లల ప్రగతిని ప్రశంసించారు.విద్యార్థులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని ,ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు.పాఠశాలకు కావలసిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుడిపూడి శ్రీనివాసరావు, ఏ.రాము, పంచాయతీ సెక్రటరీ బి.రాజేందర్, ఎండిఎం సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





ఓట్ బచావో దేశ్ బచావో కార్యక్రమంలో భాగంగా జిల్లా కాంగ్రెస్

కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ సమావేశం.

ఖమ్మం,నవంబర్ 18, మీ వార్త ప్రతినిధి.

ఓట్ బచావో దేశ్ బచావో కార్యక్రమంలో భాగంగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అర్బన్ జిల్లా కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి ల అధ్యక్షతన ఖమ్మం కార్పొరేషన్ రఘునాథపాలెం మండల బి ఎల్ ఏ బూత్ లెవెల్ ఏజంట్ల తో అత్యవసర సమావేశం జరిగింది. ముఖ్య అతిథిలుగా ఏ ఐ సి సి కార్యదర్శి వేగి వెంకటేష్, టి పి సి సి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీను బాబు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓట్ బచావో దేశ్ బచావో కార్యక్రమంపై లోక్ సభ పక్షనేత రాహుల్ గాంధీ ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో కలిసి అలుపెరుగని పోరాటం చేస్తున్నారని,డిల్లీ రాంలీలా మైదానం లో ఓట్ బచావో దేశ్ బచావో ర్యాలీ ప్రపంచ దృష్టిని ఆకర్షించింది అని తెలంగాణలో ఓట్ బచావో దేశ్ బచావో కార్యక్రమంలో భాగంగా ఈనెల 26 వ తేదీన హైదరాబాద్ లో రాజ్యాంగ పరిరక్షణకు శ్రేణులు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు.జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, అర్బన్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి లు మాట్లాడుతూ టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశానుసారం బీ ఎల్ ఏ బూత్ లెవెల్ ఏజెంట్లు ను ఓట్ రక్షకులుగా నియమించటం



జరిగిందని అన్నారు.పలు పోరాటాల ఫలితంగా ఎలక్షన్ కమిషన్ మరొక అవకాశం కల్పించిందనిఅన్నారు.గతంలో ఆబ్సెంట్,చనిపోయిన, డబుల్ వోట్లు ఉన్నాయని తొలగించిన వారి కి మరల కొత్తగా ఎన్యూమరేషన్ ఫార్మ్ అందిస్తారని తద్వారా అర్హులైన వారిని గుర్తించి వారికి బీ ఎల్ వో ల ద్వారా ఎన్యూమరేషన్ ఫార్మ్ అందేలా చూడాల్సిన బాధ్యత బీ ఎల్ ఏ లదని, బీ ఎల్ ఏ లు అందరూ ఓట్ కాపాడే ఓట్ రక్షకులుగా సేవలు అందించాలని కోరారు.అదే విధంగా ఈ నెల 26 వ తేదీన రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ ను హైదరాబాద్ లో నిర్వహించి తలపెట్టారని ఈ ర్యాలీకి మన ఖమ్మం జిల్లా నుండి శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమమును జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు టి



పి సి సి ప్రధాన కార్యదర్శి చక్కిలంరాజేశ్వరరావు,శాసనమండలి మాజీ సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు,ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కమర్తపు మురళి ,జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు దొబ్బల సౌజన్య, మొక్క శేఖర్ గౌడ్,పుచ్చకాయల వీరభద్రం, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, ఆసిఫ్ అలీ, విప్లవ కుమార్,యశ్వంత్,నగర ఓబీసీ సెల్ అధ్యక్షులు బాణాల లక్ష్మణ్ , మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, బీ ఎల్ ఏ లు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నాలుగు

మొదటి రోజు నాలుగు గ్రామాలు అమలుకు ప్రత్యేక కౌంటర్లు

- నేటి నుంచి పంచాయతీల వారీగా నమోదు ప్రక్రియ ప్రారంభం -- తొలి రోజు నాలుగు పంచాయతీల్లో కార్యక్రమం

నేలకొండపల్లి నవంబర్:18 మీ వార్త ఆర్ సి

నేలకొండపల్లి: ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గురువారం నుంచి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి లబ్ధిదారుల నమోదు ప్రక్రియ చేపట్టనున్నారు.

ఈ మేరకు బుధవారం నేలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ ఎం. యర్రయ్య, తహసీల్దార్ పి. రాంప్రసాద్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

మండలంలోని 32 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 18,708 కుటుంబాలకు ఈ పథకం వర్తించేలా ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు.

ప్రమాదవశాత్తు మరణించిన సందర్భంలో రూ. 5 లక్షల బీమా పరిహారం అందించనున్నట్లు వివరించారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు.



ప్రతి 50 ఇళ్లకు ఒక ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి బీమా నమోదు ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. కుటుంబ యజమాని పేరుతో పాటు కుటుంబ సభ్యుల్లో ఆసక్తి ఉన్న అర్హులైన వారి పేరుపై కూడా బీమా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఇందుకోసం ఆధార్ కార్డు, రేషన్ కార్డు, దరఖాస్తుతో కౌంటర్‌కు రావాలని సూచించారు.

మండలాన్ని నాలుగు బృందాలుగా విభజించి, ఒక్కో బృందానికి ఎనిమిది గ్రామ పంచాయతీల చొప్పున బాధ్యతలు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 19 నుంచి డిసెంబర్ 19 వరకు నమోదు కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించారు. తొలి రోజు కొంగర, రాజారాంపేట, ఆజయ తండా, సదాశివాపురం గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నమోదు ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రజాప్రతినిధులు, స్థానికులు, పంచాయతీ సిబ్బంది సహకరించాలని అధికారులు కోరారు.

ఈ సమావేశంలో మండల విద్యాశాఖాధికారి బి. చలపతిరావుతో పాటు వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమ్మిళిత విద్యలో ఖమ్మం జిల్లాకు రాష్ట్రస్థాయి ప్రథమ స్థానం

- సీఎంఓ బాజోజు ప్రవీణ్ కుమార్‌కు ఘన సన్మానం

నేలకొండపల్లి నవంబర్:18 మీ వార్త ఆర్ సి

నేలకొండపల్లి: సమ్మిళిత విద్యా రంగంలో విశేష ప్రగతి సాధిస్తూ ఖమ్మం జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ ఘనత సాధించడంలో కీలక పాత్ర పోషించిన ఖమ్మం జిల్లా విద్యాశాఖ సమాజ భాగస్వామ్య సమన్వయ అధికారి బాజోజు ప్రవీణ్ కుమార్‌కు రాష్ట్రస్థాయి గుర్తింపు లభించింది.

హైదరాబాద్‌లోని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకుల కార్యాలయంలో రాష్ట్ర ప్రాజెక్టు సంచాలకులు డాక్టర్ నవీన్ నికోలస్ ప్రవీణ్ కుమార్‌ను ప్రత్యేక ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరించారు.

జిల్లాలో సమ్మిళిత విద్యను సమర్థవంతంగా అమలు చేయడంలో భాగంగా ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల గుర్తింపు కోసం ప్రశాస్త్ అనువర్తనం ద్వారా ప్రాథమిక స్థాయి పరిశీలన, ప్రతి నెలా తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల సమావేశాల నిర్వహణ, వాటి వివరాలను అంతర్జాలంలో నమోదు చేయడం, ప్రత్యేక అవగాహన కార్యక్రమాల నిర్వహణ, భవిత కేంద్రాల సమర్థ నిర్వహణ, దేహదారుఢ్య చికిత్స సేవలు, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అవసరమైన హక్కులు, సదుపాయాల కల్పన వంటి కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేశారు.

ఈ కార్యక్రమాలన్నింటినీ సమన్వయం చేస్తూ ఉత్తమ ఫలితాలు సాధించడంలో ప్రవీణ్ కుమార్ చేసిన కృషిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రశంసను అందించింది.





ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ పి. శ్రీజ, జిల్లా విద్యాశాఖ అధికారి డి. వాసంతి అందించిన మార్గదర్శకత్వం, నిరంతర పర్యవేక్షణతోనే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. భవిష్యత్తులోనూ సమ్మిళిత విద్యా కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తూ ఖమ్మం జిల్లాను మరింత ఉన్నత స్థానాలకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు.

రాష్ట్రస్థాయి గుర్తింపు తనపై మరింత బాధ్యతను పెంచిందని, దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు, విద్యాభివృద్ధి, సమాన విద్యా అవకాశాల కల్పన, మెరుగైన సేవలు అందించడం కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు.

ఈ విజయం తన ఒక్కడి కృషి ఫలితం కాదని, జిల్లా సహచర సమన్వయకర్తలు, ప్రత్యేక ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, బోధనా, బోధనేతర సిబ్బంది సమిష్టి కృషి ఫలితమని పేర్కొంటూ వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా నేలకొండపల్లి మండల విద్యాశాఖ అధికారి బి. చలపతిరావు సీఎంఓ బాజోజు ప్రవీణ్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ అమలెప్పుడు?

దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) నిర్వహణ ఆర్థికంగా సుస్థిరంగా ఉండేలా తీసుకొస్తున్న మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధానం అమలుపై అనిశ్చితి కొనసాగుతోంది. ఎంపిక చేసిన యూపీఐ వ్యాపార లావాదేవీలపై ఎండీఆర్ విధించేందుకు సెప్టెంబర్‌లో ప్రకటించిన విధానానికి సంబంధించి తుది అమలు తేదీని వెల్లడించాలని పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)లను కోరుతోంది. పండుగల సీజన్ నేపథ్యంలో వాయిదా పడిన ఈ విధానాన్ని ఎప్పటి నుంచి అమలు చేస్తారనే అంశంపై చెల్లింపుల పరిశ్రమలో ఆసక్తి నెలకొంది.

ఎండీఆర్ విధానం ఏమిటి?

మర్చంట్ డిస్కౌంట్ రేట్ అంటే డిజిటల్ చెల్లింపులను స్వీకరించే వారి నుంచి చెల్లింపుల వ్యవస్థలోని భాగస్వాములు వసూలు చేసే లావాదేవీ రుసుము. బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు, యూపీఐ యాప్‌ల నిర్వహణ సంస్థలకు ఈ మొత్తం ఆదాయ వనరుగా ఉంటుంది. సెప్టెంబర్ 15, 2026న కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించిన విధానం ప్రకారం, రూ.2,000కు మించిన అర్హత కలిగిన పర్సన్ టు మర్చంట్ (పీ2ఎం) లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ వర్తిస్తుంది.



అయ్యప్ప స్వామికి అభిషేకాలు



కారేపల్లి నవంబర్ 18 మీ వార్త ప్రతినిధి

మండల కేంద్రమైన కారేపల్లిలో గంగమ్మ తల్లి ఆలయ మినీ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన అయ్యప్ప పీఠం వద్ద బుధవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. కార్తిక మాసం పర్వదినాన్ని పురస్కరించుకొని అయ్యప్ప స్వామి విగ్రహానికి అంగరంగ వైభవంగా అభిషేకాలు చేపట్టారు. పూలు, పండ్ల రసాలతో కన్నుల పండుగగా వేడుకను జరిపారు. అయ్యప్ప భజనలు, కీర్తనలతో ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది. గురుస్వాములు పాలిక సారయ్య, సంగు సాయి, శంకర్, పాలిక శ్రీనివాస్, పాలిక రమేష్, గోకినపల్లి నాగరాజు, కట్టా రమేష్, జిట్టబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సర్పంచ్ హిరాలాల్ ప్రత్యేక చొరవ...

- ఆలయ ప్రాంగణంలో ఫ్లోరింగ్, మాలదారులకు షవర్లు, విద్యుత్ దీపాల ఏర్పాటు...

సింగరేణి, నవంబర్ 18, మీ వార్త ప్రతినిధిమండల పరిధిలోని



భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ సామ్యతండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన అభివృద్ధికి సర్పంచ్ బానోత్ హిరాలాల్ ప్రత్యేక చొరవ చూపించారు. ఆలయ పరిసర ప్రాంతంలో ఫ్లోరింగ్ లేక భక్తులు, మాలదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు.ఈ క్రమంలో ఆలయ ప్రాంగణమంతా ఫ్లోరింగ్ పనులు చేపట్టడంతో పాటు, స్వామివారి మాలధారణ చేసే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా షవర్లను ఏర్పాటు చేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలో అవసరమైన విద్యుత్ దీపాలను సైతం ఏర్పాటు చేయించారు. దీంతో ఆలయ పరిసరాలు మరింత సౌకర్యవంతంగా మారడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు ఆలయ చైర్మన్ ధరావత్ కళ్యాణ్ పేర్కొనారు. గ్రామ అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి కూడా ప్రాధాన్యతనిస్తూ సర్పంచ్ హిరాలాల్ ముందుకు సాగడంపై ఆలయ చైర్మన్ కళ్యాణ్,ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం నేత మాడిశెట్టి శ్రీనివాస్ సేవలు చిరస్మరణీయం

- మాడిశెట్టి శ్రీనివాస్ ఆశయాలను ప్రతి బీసీ సభ్యుడు కొనసాగించాలి

- కే ఎన్ రాజశేఖర్ ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సేవకులు

కొత్తగూడెం,నవంబరు 18మీ వార్త ఆర్ సి



: బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు మాడిశెట్టి శ్రీనివాస్ దశదినకర్మ కార్యక్రమం వారి స్వగృహంలో మాడిశెట్టి రవిరాజు దివాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగినది, కార్యక్రమానికి విచ్చేసిన బంధువులు స్నేహితులు శ్రేయోభిలాషులు సంఘం నాయకులు తొలత మాడిశెట్టి శ్రీనివాస్ ఆకస్మిక మృతికి మౌనం పాటిస్తూ రెండు నిమిషాలు నివాళి అర్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలోపాల్గొన్న పలువురు నేతలు మాడిశెట్టి శ్రీనివాస్ యొక్క గొప్పతనాన్ని ఆయన సేవా భావాన్ని మననం చేసుకుంటూ వారికి ఘనమైన నివాళి అర్పించడం జరిగింది,

మహోన్నతమైన వ్యక్తి మాడిశెట్టి శ్రీనివాస్ 1969 తెలంగాణ రాష్ట్ర సాధన సమితి ఇచ్చిన పిలుపుమేరకు ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం సాగించిన గొప్ప యోధుడు మాడిశెట్టి శ్రీనివాస్ బీసీలు అంతా ఐక్యంగా ఉండి రాజ్యపాలనలో బీసీల సతాచాటాలని దృఢ సంకల్పంతో పనిచేసి ఆర్ కృష్ణయ్య నాయకత్వంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులుగా జిల్లా ఆవిర్భావం నుండి తాను మరణించే వరకు కూడా పనిచేసిన వ్యక్తి అలాంటి వ్యక్తి మనకు దూరం కావడం దురదృష్టకరమంటూ

భారత ప్రధాని నరేంద్ర మోడీ మంకీ బాతులో ప్రశంసలు అందుకున్న కొట్టూరి నూర్వి కే ఎన్ రాజశేఖర్ మాడిశెట్టి శ్రీనివాస సంతాప సూచికంగా మొక్కను నాటి ఘన నివాళి అర్పించడం జరిగినది,

నేటి నుండి కామేపల్లి గురు హరిహర మందిరం లో కార్తీక ఏకాదశి ఉత్సవాలు

కామేపల్లి, నవంబర్ 18 మీ వార్త ప్రతినిధి :



కామేపల్లి లోని గురు హరి హర మందిరంలో గురువారం నుండి కార్తీక ఏకాదశి ఉత్సవాలు ప్రారంభం అవుతాయని భక్త మండలి అధ్యక్షులు గొట్టుపర్తి శివాజీ బుధవారం తెలిపారు.ఈ సందర్భంగా మందిరంలో శివునికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు, పంచామృత అభిషేకాలతో పాటు ప్రతి సంవత్సరం జరిగే విధంగా గురువారం శివనామ ఏకాహం శుక్రవారం హరే రామ నామ సంకీర్తన ఏకాహం జరుగుతాయని ప్రతిరోజు హనుమాన్ చాలీసా పారాయణం,నగర సంకీర్తన జరుగుతాయని ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.



జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన ప్రజావాణి.

ఖమ్మం,నవంబర్ 18,మీ వార్త ప్రతినిధి.



జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులకు, జిల్లా కాంగ్రెస్ నాయకులకు, బ్లాక్,మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులకు,కార్యకర్తలకు, అభిమానులకు, జిల్లా ప్రజలకు మనవి. ఈ రోజు ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన ప్రజావాణిఖమ్మం జిల్లా ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషిచేసే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించబడుతున్నది.కావున శ్రేణులు అందరు సకాలంలో విచ్చేసి కార్యక్రమమును జయప్రదం చేయగలరు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి

-- డీసీసీ అధ్యక్షురాలు తోటా దేవి ప్రసన్న



కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ప్రతి కుటుంబానికి ఒక భరోసా -- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం కానుండటం పట్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తోటా దేవి ప్రసన్న హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సీఎం కార్యాలయం నుంచి పంపించిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించిన ప్రజా అవగాహన కరపత్రాలను ఈరోజు కొత్తగూడెంలోని డీసీసీ కార్యాలయంలో జిల్లా మండల కాంగ్రెస్ అధ్యక్షులకు అందజేశారు.

ఈ సందర్భంగా తోటా దేవి ప్రసన్న మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి భరోసా కల్పించేలా ఇంత మంచి జీవిత బీమా పథకాన్ని తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ పథకంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు.

జిల్లాలో రేపటి నుంచి ప్రారంభం కానున్న అవగాహన, నమోదు క్యాంపుల్లో ప్రజలందరూ పాల్గొనేలా మండల అధ్యక్షులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. అందజేసిన కరపత్రాలను ప్రతి కుటుంబానికి, ప్రతి గడపకు చేరవేసి పథకం వివరాలను ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ ప్రజాహిత పథకం ద్వారా ప్రతి కుటుంబానికి భరోసా కల్పించే లక్ష్యంతో కాంగ్రెస్ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చీకటి కార్తీక్, జిల్లా అధికార ప్రతినిధి ఎర్రమల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెదబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు గారికి వివాహ ఆహ్వాన పత్రిక అందజేత



కారేపల్లినవంబర్ 18 మీ వార్త ప్రతినిధి

వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ తన పెద్ద కుమార్తె డాక్టర్ మాలోత్ గాయత్రి వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించవలసిందిగా కోరుతూ, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిభట్టి విక్రమార్క మల్లు మర్యాదపూర్వకంగా కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. డిసెంబర్ 03వ తేదీన వైరాలో ఘనంగా జరగనున్న ఈ వివాహ మహోత్సవానికి విచ్చేసి వధూవరులను ఆశీర్వదించాలని ఉప ముఖ్యమంత్రి సాదరంగా ఆహ్వానం పలికారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీకి వాసవి చిరు వ్యాపార సంఘం ఏర్పాట్లు.

ఖమ్మం,నవంబర్ 18,మీ వార్త ప్రతినిధి.

నిరుపేదలకు చేయూతనందించే లక్ష్యంతో వాసవి చిరు వ్యాపార సంఘం ఆధ్వర్యంలో త్వరలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సేవా కార్యక్రమానికి వనమా ట్రస్ట్ అధినేత వనమా సూరి 15 దుప్పట్లను విరాళంగా అందజేశారు.ఈ మేరకు సంఘం అధ్యక్షులు మిట్టపల్లి రవికి దుప్పట్లను అందించారు. రానున్న రోజుల్లో వీటిని పేదలకు పంపిణీ చేయనున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఆర్యవైశ్య మహాసభ మాజీ ఉపాధ్యక్షులు అనిల్, ఆర్యవైశ్య నాయకులు విన్నమూరి సుబ్బారావు, కొంకిమళ్ళ మృత్యుంజయరావు, స్వాతి హాస్పిటల్, వినాయక హాస్పిటల్ అధినేత పసుమర్తి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధ్యక్షులు మిట్టపల్లి రవి మాట్లాడుతూ, నిరుపేదలకు సహాయం అందించేందుకు ముందుకొచ్చి 15 దుప్పట్లు అందించిన వనమా సూరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దాతల సహకారంతో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.సేవే లక్ష్యంగా వాసవి చిరు వ్యాపార సంఘం ముందుకు సాగడం అభినందనీయమని పలువురు కొనియాడారు.

కొనిజర్ల మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక.

- అధ్యక్షుడిగా రెవరెండ్ టి.ప్రభాకర్ రావు ఎన్నిక..

- క్రైస్తవ సంఘాల ఐక్యత, అభివృద్ధికి సమష్టి కృషి చేస్తామని నూతన కమిటీ వెల్లడి.

కొనిజర్ల,ఖమ్మం,నవంబర్ 18,మీ వార్త ప్రతినిధి.





కొనిజర్ల మండలంలోని లింగగూడెం వర్షిప్ సెంటర్‌లో మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పాస్టర్లు పాల్గొని నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఫెలోషిప్ అధ్యక్షుడిగా రెవరెండ్ టి. ప్రభాకర్ రావు ఎన్నికయ్యారు.నూతన కమిటీ వివరాలు ఇలా ఉన్నాయి. అధ్యక్షుడిగా రెవరెండ్ టి.ప్రభాకర్ రావు, ఉపాధ్యక్షుడిగా పాస్టర్ యాకోబు, ప్రధాన కార్యదర్శిగా షడ్రక్ పాల్, జాయింట్ సెక్రటరీగా పాస్టర్ ఇస్సాకు, కోశాధికారిగా పాస్టర్ మిఖాయేలు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా పాస్టర్ బి. రాజు,గౌరవ సలహాదారులుగా పాస్టర్ పీటర్, పాస్టర్ రాంబాబు, పాస్టర్ దినకర, పాస్టర్ నరసింహారావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పలువురు పాస్టర్లు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని పాస్టర్లందరినీ ఐక్యంగా ముందుకు నడిపిస్తూ, క్రైస్తవ సంఘాల మధ్య సోదరభావం, ఐక్యతను బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

అలాగే ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సమాజ సేవా కార్యక్రమాలు, పేదలకు సహాయం, యువతలో నైతిక విలువల పెంపు, క్రైస్తవుల సమస్యల పరిష్కారం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, అందరి సహకారంతో ఫెలోషిప్ అభివృద్ధికి, ఐక్యతకు కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికలతో మండల పాస్టర్లలో నూతన ఉత్సాహం నెలకొంది.

నేలకొండపల్లి మండలంలో వీధి కుక్కల స్వైరవిహారం!

- పట్టించినా మారని పరిస్థితి.. మళ్లీ గ్రామంలోకి చేరిన కుక్కలు

- బాటసారులు, ద్విచక్ర వాహనదారులపై దాడులకు యత్నం.. ప్రజల్లో భయాందోళన

- ప్రమాదం జరిగిన తర్వాతే అధికారులు మేల్కొంటారా?

నేలకొండపల్లి నవంబర్: మీ వార్త ఆర్ సి



నేలకొండపల్లి గ్రామంలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. గ్రామంలోని పలు వీధులు, ప్రధాన రహదారులపై వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ అటుగా వెళ్లే బాటసారులు, ద్విచక్ర వాహనదారుల వెంటపడుతూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. గతంలో గ్రామపంచాయతీ అధికారులు వీధి కుక్కలను పట్టించినప్పటికీ, వాటిలో కొన్ని తిరిగి గ్రామంలోకి చేరి యథావిధిగా స్వైరవిహారం చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒకవైపు రోడ్లపై వాహనాల రద్దీ, మరోవైపు గుంపులుగా సంచరిస్తున్న కుక్కలతో ప్రజలు రాకపోకలు సాగించాలంటేనే భయపడుతున్నారు. ముఖ్యంగా ఉదయం పూట పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు, పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని కుక్కలు వెంబడిస్తుండటంతో వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు ఉన్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించిన కుక్కలు మళ్లీ గ్రామంలోకి ఎలా వచ్చాయి?

గతంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వీధి కుక్కలను పట్టించే కార్యక్రమం చేపట్టినప్పటికీ సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదు. పట్టించిన కుక్కల్లో కొన్ని తిరిగి గ్రామంలోకి చేరి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. కుక్కలను పట్టించిన తర్వాత వాటికి ఎలాంటి చర్యలు చేపట్టారు? వాటికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించారా? రేబిస్ నిరోధక టీకాలు వేయించారా? లేక కేవలం పట్టించి వేరే ప్రాంతంలో వదిలేసి చేతులు దులుపుకున్నారా? అన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

ప్రజల ప్రాణ భద్రత పట్టదా?

వీధుల్లో చిన్నపిల్లలు ఆడుకోవాలన్నా, వృద్ధులు నడుచుకుంటూ వెళ్లాలన్నా కుక్కల భయం వెంటాడుతోంది. రాత్రి వేళల్లో ఒంటరిగా వెళ్లేవారి పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. ఎప్పుడు ఏ కుక్క వెంటపడుతుందో, ఎప్పుడు దాడి చేస్తుందోనన్న భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రజలకు ఇంతటి సమస్య ఎదురవుతున్నా సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కారం దిశగా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో అర్థం కావడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

అధికారులకు ప్రజల సూటి ప్రశ్నలు!

గతంలో పట్టించిన కుక్కలు తిరిగి గ్రామంలోకి ఎలా వచ్చాయి? వాటిపై తీసుకున్న చర్యల వివరాలు ఏమిటి? గ్రామంలోని వీధి కుక్కల సంఖ్యను అధికారులు అంచనా వేశారా? వాటికి రేబిస్ నిరోధక టీకాలు వేయించారా? కుక్కల సంతాన నియంత్రణకు స్టెరిలైజేషన్ కార్యక్రమం చేపట్టారా? ప్రజలు రోడ్లపైకి రావాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడితే గ్రామపంచాయతీ పాలకవర్గం ఏం చేస్తున్నట్లు? ప్రజల భద్రతకు భరోసా కల్పించాల్సిన బాధ్యత అధికారులకు లేదా? ఏదైనా పెద్ద ప్రమాదం జరిగిన తర్వాతే అధికారులు స్పందిస్తారా? అన్న ప్రశ్నలు గ్రామస్థుల నుంచి వినిపిస్తున్నాయి.

ఇప్పటికైనా స్పందించాలి.. శాశ్వత పరిష్కారం చూపాలి!

వీధి కుక్కల సమస్యను తాత్కాలిక చర్యలతో కాకుండా శాస్త్రీయ పద్ధతిలో పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామంలోని కుక్కలను గుర్తించి, వాటికి జంతు జనన నియంత్రణ శస్త్రచికిత్సలు, రేబిస్ నిరోధక టీకాలు వేయించడంతో పాటు అవసరమైన పర్యవేక్షణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దూకుడుగా ప్రవర్తించే కుక్కల విషయంలో నిబంధనల ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గ్రామపంచాయతీ పాలకవర్గం, కార్యదర్శి, సంబంధిత పశువైద్య మరియు జంతు సంక్షేమ అధికారులు సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలి.

ప్రజలకు రక్షణ కల్పించడం గ్రామపంచాయతీ బాధ్యత కాదా? ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యత కాదా? నేలకొండపల్లి ప్రజల భయాందోళనలకు తెరదించి వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

అతి చిన్న వయసులోనే హైకోర్టు న్యాయవాదిగా శ్రీ చక్రపాణి.

- అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తూ, క్లిష్టమైన కేసులను సైతం అలవోకగా ఛేదిస్తున్న యువ న్యాయవాదికి అభినందనలు.

- పెద్ద కేసులను ఛేదిస్తున్న యువ హైకోర్టు న్యాయవాది.

ఖమ్మం, నవంబర్ 18,మీ వార్త ప్రతినిధి.



పట్టుదల, అంకితభావం, న్యాయశాస్త్రంపై అపారమైన పట్టు ఉంటే వయసుతో సంబంధం లేకుండా అత్యున్నత విజయాలను సాధించవచ్చని నిరూపిస్తున్నారు. యువ హైకోర్టు న్యాయవాది పుల్లబోట్ల వివిఎల్ఎస్ శ్రీ చక్రపాణి అతి చిన్న వయసులోనే న్యాయవాద వృత్తిని ఎంచుకున్న ఆయన, నేడు ఉన్నత న్యాయస్థానంలో హై కోర్టు ఎన్నో క్లిష్టమైన, కీలకమైన కేసులను సమర్థవంతంగా వాదిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.

న్యాయవాద వృత్తిలో అద్భుత ప్రతిభ సాధారణంగా న్యాయవాద వృత్తిలో అనుభవం గడించడానికి చాలా ఏళ్లు పడుతుంది. కానీ పుల్లబోట్ల వివిఎల్ఎస్ శ్రీ చక్రపాణి తన పదునైన వాదనలతో, చట్టాలపై ఉన్న లోతైన అవగాహనతో అతి తక్కువ కాలంలోనే సీనియర్ న్యాయవాదుల సరసన నిలిచారు.సివిల్, క్రిమినల్, రాజ్యాంగబద్ధమైన కీలక కేసులలో బాధితులకు న్యాయం చేకూర్చడంలో ఆయన కీలక పాత్రపోషిస్తున్నారు. కక్షిదారులకు భరోసా, యువతకు ఆదర్శం న్యాయస్థానంలో ఆయన వినిపించే బలమైన వాదనలు ఎందరో కక్షిదారులకు క్లయింట్స్ కొండంత భరోసానిస్తున్నాయి. సామాన్యులకు సత్వర న్యాయం అందాలనే లక్ష్యంతో ఆయన చేస్తున్న కృషి పట్ల తోటి న్యాయవాదులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.చిన్న వయసులోనే ఇంతటి గొప్ప స్థాయికి చేరుకున్న పుల్లబోట్ల వివిఎల్ఎస్ శ్రీ చక్రపాణి నేటి యువతకు ఎంతో ఆదర్శంగానిలుస్తున్నారు.భవిష్యత్తులో ఆయన మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.ఆయన ఇటీవల విజయం సాధించిన కేసు 25 వేల వివాదంలో కీలకమైన న్యాయపరమైన ఉపశమనం అడ్వకేట్ వివిఎల్ఎస్ శ్రీచక్రపాణి న్యాయవాద ప్రతిభను ప్రస్తావించాల్సి వచ్చినప్పుడు, తెలంగాణ హైకోర్టులో దాఖలైన డబల్యు.పి. నెం.35403 అఫ్ 2026 ప్రత్యేకంగా ప్రస్తావించదగిన కేసుగా నిలుస్తుంది. సైబర్ నేరానికి సంబంధించిన దర్యాప్తులో భాగంగా ఒక విద్యార్థికి చెందిన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఖాతా నిలిపివేయ బడింది.ఆ ఖాతాలోకి అనుమానాస్పద లావాదేవీ ద్వారా రూ.25,000 జమ అయినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. అయితే, వివాదాస్పద మొత్తం రూ.25,000 మాత్రమే అయినప్పటికీ, మొత్తం బ్యాంకు ఖాతాను స్తంభింపజేయడంతో విద్యార్థి తన ఇతర చట్టబద్ధమైన ఆర్థిక లావాదేవీలను నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది.ఈ నేపథ్యంలో పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన అడ్వకేట్ పుల్లబొట్ల వివిఎల్ఎస్ శ్రీచక్రపాణి, వివాదాస్పద మొత్తాన్ని మాత్రమే నిలుపుదల చేసి, మిగిలిన ఖాతా కార్యకలాపాలను కొనసాగించేందుకు అనుమతించాలనే కీలకమైన న్యాయపరమైన అంశాన్ని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనలకు మద్దతుగా మద్రాస్, కేరళ, తెలంగాణ హైకోర్టులలో వెలువడిన ఐదు న్యాయపూర్వ తీర్పులను ఆధారాలుగా సమర్పించారు. బ్యాంకు ఖాతాను పూర్తిగా స్తంభింపజేయడం కంటే, దర్యాప్తు ప్రయోజనాలను కాపాడుతూ వివాదాస్పద మొత్తానికే పరిమితి విధించడం సముచితమనే వాదనను సమర్థంగా వినిపించారు.ఈ కేసులో న్యాయస్థానం ఇచ్చిన ఆదేశం పిటిషనర్‌కు గణనీయమైన ఉపశమనాన్ని కల్పించింది. రూ.25,000 మొత్తంపై లియన్ కొనసాగిస్తూ, మిగిలిన లావాదేవీల కోసం బ్యాంకు ఖాతాను తిరిగి వినియోగించుకునేందుకు అనుమతించాలని సంబంధిత బ్యాంకును హైకోర్టు ఆదేశించింది. ఈ తీర్పు దర్యాప్తు ప్రయోజనాల పరిరక్షణతో పాటు వ్యక్తుల చట్టబద్ధమైన ఆర్థిక హక్కులను కూడా సమతుల్యం చేయాల్సిన అవసరాన్ని స్పష్టం చేసింది.ఈ కేసులో శ్రీచక్రపాణి



వినిపించిన వాదనల ప్రాధాన్యత ఇదే సుప్రీంకోర్టు స్థాయి న్యాయపరమైన అనుభవం,శ్రీచక్రపాణి న్యాయవాద ప్రయాణంలో సుప్రీంకోర్టు అనుభవం కూడా ఒక ముఖ్యమైన అంశం భారత ప్రధాన న్యాయమూర్తి గా పనిచేసిన జస్టిస్ ఎన్.వి.రమణ కార్యాలయంలో ఇంటర్న్‌గా పనిచేసిన సమయంలో అడ్మిషన్ విషయాలపై సంక్షిప్త నోట్లు సిద్ధం చేయడం, బెయిల్ అంశాలు, ట్రాన్స్‌ఫర్ పిటిషన్లు, మధ్యవర్తిత్వ చట్టానికి సంబంధించిన నిబంధనలపై పరిశోధన చేయడం వంటి బాధ్యతలను నిర్వహించారు. అలాగే, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ వద్ద కూడా ఇంటర్న్‌షిప్ ద్వారా న్యాయస్థాన కార్యకలాపాలపై విలువైన అనుభవాన్ని పొందారు. అనంతరం అడ్వకేట్ ఎం.కె.జలీల్ వద్ద న్యాయవాద వృత్తికి సంబంధించిన అనుభవాన్ని పెంపొందించుకుని, గురుగ్రామ్‌లోని ఏస్,ఏ లా ఆఫీసుస్ సంస్థలో డిస్ప్యూట్ రేసొల్యూషన్ విభాగంలో అసోసియేట్‌గా పనిచేశారు. ఈ అనుభవాలు వివాద పరిష్కారం, కేసుల పరిశీలన, న్యాయపరమైన వ్యూహరచన వంటి అంశాల్లో ఆయనకు ప్రాయోగిక అవగాహనను అందించాయి.

రైతులు ఎల్ నినో, ఖేతీ బచావో అభియాన్ పై అవగాహన అలవర్చుకోవాలి

- బిందు,తుంపర సేద్య పద్ధతులు పాటించాలి
- పొలాల్లో నీటి వృధాను అరికట్టాలి.
- వర్షపు నీటి సంరక్షణకు ఫామ్ పాండ్స్, ఇంకుడు గుంతలు దోహదం
- ఖమ్మం ఎఫ్ టీ సి డిడిఏ, ఆత్మ పీడీ బి.సరిత,ఏడిఏ వాణి,

కామేపల్లి, నవంబర్ 18 మీ వార్త ప్రతినిధి:





రైతులు ఎల్ నినో, ఖేతీ బచావో అభియాన్ పై అవగాహన అలవర్చుకో వాలని ఖమ్మం ఎఫ్ టీ సి డిడిఏ, ఆత్మ పీడీ బి.సరిత , ఏడిఏ వాణి, ఖమ్మం ఏవో అరుణకుమారి,స్థానిక ఏవో బి.తారా దేవి కోరారు.కామేపల్లి మండలం సాతానిగూడెం గ్రామంలో ఎల్నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తీసుకోవాల్సిన ప్రత్యామ్నాయ ప్రణాళిక, "ఖేతీ బచావో అభియాన్" పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని రైతులకు ఎల్నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పాటించాల్సిన ప్రత్యామ్నాయ వ్యవసాయ ప్రణాళికలు,ముందస్తు జాగ్రత్తలు,ఖేతీ బచావో అభియాన్ ముఖ్య ఉద్దేశాలపై అవగాహన కల్పించి చైతన్యపరిచారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ తగిన వ్యవసాయ యాజమాన్య పద్ధతులను అవలంబించి పంటలను సంరక్షించుకో వాలని కోరారు.పశువుల ఎరువు, కంపోస్ట్, పచ్చిరొట్ట ఎరువులు వినియోగించాలని, నేలలో సేంద్రియ కర్బన శాతాన్ని పెంచాలని అన్నారు.నీటి సంరక్షణ కొరకు ప్రతి నీటి బొట్టును సమర్థవంతంగా వినియోగిం చుకోవాలని వీలైన చోట్ల బిందు తుంపర సేద్య పద్ధతులను పాటించాలని, పొలాల్లో నీటి వృథాను అరికట్టాలని కోరారు. వర్షపు నీటి సంరక్షణకు ఫామ్ పాండ్స్, ఇంకుడు గుంతలు ఉపయోగించుకో వాలని,పంటల వైవిధ్యీకరణ ను పాటించాలని, ఒకే పంటపై ఆధారపడకుండా పంటల మార్పిడి చేపట్టాలని పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజల సాగును ప్రోత్సహించాలని అన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన స్వల్పకాలిక పంట రకాలను ఎంచుకోవాలని, అంతర పంటలు, మిశ్రమ పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు.ఈ అవగాహన కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా రెడ్యా, ఏఈవో జి.దీపక్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సిహెచ్ లావణ్య, రైతులు ఎస్.వీరబాబు,కె.నరసింహారెడ్డి,జె.వెంకటేశ్వర్లు, ఏ.వెంకటేశ్వర్లు,కె బిక్షం,కె .రామయ్య,కె .రమేష్,కె.బుచ్చయ్య,డి .శివకృష్ణ,డి .బ్రహ్మము,టీ .సీత్తయ్య,ఎం .బసవయ్య పాల్గొన్నారు.

నేడు ఖమ్మంలో జర్నలిస్టుల నిరసన.

- జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి.
- టీజేఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ చిర్రా రవి డిమాండ్.

ఖమ్మం నవంబర్ 18,మీ వార్త ప్రతినిధి.



ఖమ్మంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు టీజేఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నేడు ఉదయం 10 గంటలకు ఖమ్మం జడ్పీ సెంటర్ లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు టి యు డబ్ల్యూ జే,టీజేఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దశాబ్దాల తరబడి జర్నలిస్టులకు అన్యాయం జరుగుతూనే ఉందని, ప్రభుత్వాలు మారిన పాలకులు మారుతున్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ కాలంలో క్యాబినెట్ ఆమోదం పొంది జీవో 147 ద్వారా కేటాయించిన స్థలాన్ని తక్షణమే జర్నలిస్టులకు బదులాయింపు చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం అయ్యేవరకు దశల వారి ఉద్యమాలు కొనసాగుతాయని నేడు జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

ఆయా కుసుమ కుటుంబానికి అంగన్వాడీ ఆర్థిక చేయూత!

కారేపల్లి నవంబర్ 18 మీ వార్త ప్రతినిధి



సింగరేణిమండలం రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని అనంతారం అంగన్వాడీ కేంద్రంలో ఆయగా పనిచేస్తున్న ఈసం కుసుమ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో ఆమె కుటుంబానికి అంగన్వాడీ ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది అండగా నిలిచారు. సూపర్‌వైజర్ దేవేంద్ర చొరవతో ఆమె కార్యం నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. బుధవారం సర్పంచ్ వీసం మోతి వీరస్వామి చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ఈశ్వరి, ఆశా వర్కర్ వై. రాధ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల కళ్లలో ఆనందం.. ఎన్నో ఏళ్ల తర్వాత పింఛన్ల పంపిణీ.







- సుమారు వెయ్యి మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేత
- అర్హత ఉండి పెన్షన్ రాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి.. ప్రతి ఒక్కరికీ పెన్షన్ ఇప్పించే బాధ్యత నాది
- పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు

మణుగూరు నవంబర్ 18 మీ వార్త ప్రతినిధి :

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో నూతన చేయూత పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో ఘనంగా జరిగింది. మణుగూరు మండలం, మున్సిపాలిటీ పరిధిలో సుమారు వెయ్యి మంది లబ్ధిదారులకు పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ శ్రీ పాయం వెంకటేశ్వర్లు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన లబ్ధిదారులకు చేయూత పెన్షన్లు మంజూరు కావడం సంతోషకరమన్నారు. పెన్షన్ మంజూరు కాలేదని ఎవరూ నిరాశ చెందవద్దని, పేరులో తప్పులు, ఆధార్ కార్డు లేదా ఇతర కారణాలతో పెన్షన్ రాని అర్హులు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తనకు లేదా సంబంధిత అధికారులకు దరఖాస్తులు అందజేస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.మణుగూరు మండలంలో సుమారు వెయ్యి మంది కొత్త పెన్షన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్నామని, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు ఈ పెన్షన్లు ఆర్థికంగా ఎంతో ఆసరాగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీలో ఎవరూ ఇబ్బందులు పడకుండా 14 గ్రామపంచాయతీల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని, మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో వార్డుల వారీగా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి లబ్ధిదారుడికి మంజూరు పత్రం అందేలా చూడాలని, ఎవరినీ ఖాళీ చేతులతో వెనక్కి పంపవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో మణుగూరు మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో, 14 గ్రామపంచాయతీల సర్పంచులు, ఉపసర్పంచులు, మున్సిపాలిటీ వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా చేయూత పెన్షన్లు పొందుతున్న వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు తదితర లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరై ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమం అంతా పండుగ వాతావరణాన్ని తలపించింది.

కామేపల్లి పీహెచ్సీలో సాధారణ ప్రసవం ఆరోగ్యంగా తల్లి,శిశువు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ సుదీప్

కామేపల్లి, నవంబర్ 18 మీ వార్త ప్రతినిధి :



కామేపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మద్దులపల్లి కి చెందిన గర్భిణీ మహిళ పడిగ కళ్యాణి కి బుధవారం సాధారణ ప్రసవం చేయడం జరిగిందని డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ సిహెచ్ సుదీప్ తెలిపారు.ఆమె మగ బిడ్డకు జన్మనిచ్చిందని తెలిపారు. పుట్టిన మగ బిడ్డ బరువు 2.7 కిలోలని,జీరో డోస్ టీకాలు వేయడం జరిగిందని తెలిపారు. పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించడం ప్రారంభించారని , తల్లి,శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని వారు తెలిపారు.

తెల్లం శరత్ కుటుంబానికి న్యాయం జరగకపోతే ఉద్యమం తీవ్ర రూపం దాల్చుతుంది... పా యం.. హెచ్చరిక..

భద్రాచలం నవంబర్ 18 మీ వార్త: భద్రాచలం 16 తారీకున రాత్రి శ్రీ సత్య సాయి రెసిడెన్సి లాడ్జి దగ్గర జరిగిన తెల్లం శరత్ హత్య విషయంలో కొంతమంది గిరిజ నేతరులు కేసును నీరు కార్చడానికి ప్రయత్నాలు చేస్తున్నారని అలాంటి కుట్రలు మానుకోవాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ సూటిగా హెచ్చరించిశీది . . బుధవారం నాడు చర్ల గణేష్ నగర్ లో సంఘం జిల్లా అధ్యక్షులు బీరబోయిన శేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గొండ్వానా సంక్షేమ పరిషత్తు రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలం నడిబొడ్డున విచ్చలవిడిగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తూ కమర్షియల్ వ్యాపారాలు కొనసాగిస్తూ లబ్ధి పొందుతున్నారని అన్నారు.

ట్రైబల్ డెవలప్మెంట్ అని చెప్పుకుంటున్న ఐటీడీఏ పీవో ఒక ఆదివాసి యువకుడు దారుణ హత్యకు గురి అయితే కనీసం ట్రైబల్ పక్షాన మాట్లాడలేని దుస్థితిలో ఉంటున్న ఐటిడిఏ అధికారులు తల ఒశేచుకొని సిగ్గుపడాలి. అలాగే భద్రాచలం లోకల్ ఎమ్మెల్యే ఆదివాసుల పక్షాన లేక గిరిజనేతరుల పక్షానా ఆదివాసులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భద్రాచలం పట్టణంలో గడిచిన ఈ 10 సంవత్సరాల కాలంలో అడ్డు అదుపు లేకుండా ప్రభుత్వ భూములను సైతం కబ్జా చేసి బహుళ అంతస్తు భవనాలు నిర్మిస్తూ చట్ట ఉల్లంఘనకు పాల్పడుతున్న సంబంధిత అధికారులు నిమ్మకు నీ రెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని తీవ్రంగా ఆక్షేపించారు ఎన్ని దరఖాస్తులు ఇచ్చిన ఉద్యమాలు చేసిన ఎలాంటి ఫలితాలు కనిపించడం లేదని తీవ్రంగా దుయ్యబట్టారు.



ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు జిల్లా అధ్యక్షులు బీ రబోయిన శేఖర్ . జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గొంది లీలాప్రసాద్... మాజీ జెడ్పిటిసి సోయం రాజారావు . మండల అధ్యక్షులు ఇర్ప అంజిబాబు. మాజీ సర్పంచ్ ఎలకం నరేందర్.. ఖంబ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు ఇర్పప్రకాష్ ... కల్లూరు శ్రీనివాసరావు. చర్ల అవార్డు మెంబర్ కట్టం కన్నారావు తదితరులు పాల్గొన్నారు...

కుమారుడి పుట్టినరోజున సేవా స్ఫూర్తి.. విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ!



నేరడిగొండ : 'చేయూత ఫౌండేషన్' చైర్మన్ ఎన్.టి. రమణ తన కుమారుడు జాన్ పాల్ జన్మదినాన్ని పురస్కరించుకుని కుమారి గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, ఇతర విద్యా సామగ్రిని పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచారు.ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని, విద్యార్థులంతా క్రమశిక్షణ తో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకలను కేవలం వ్యక్తిగత సంబరాలకే పరిమితం చేయకుండా, పేద విద్యార్థులకు ఉపయోగపడేలా సేవా కార్యక్రమం నిర్వహించడం ఎంతో అభినందనీయమని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగారాం, శివలీల తదితరులు జాన్ పాల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తులో ఉన్నత ఆశయాలతో మరింత అభివృద్ధి సాధించాలని దీవించారు.

డిసెంబరు 9న చలో హైదరాబాద్

ఆదివాసీ హక్కుల సభకు తొమ్మిది తెగల మద్దతు

ప్రతి ఆదివాసీ కుటుంబం నుంచి ఒకరు తరలిరావాలి



ఆసిఫాబాద్ : ఆదివాసీల హక్కుల సాధన కోసం డిసెంబరు 9న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఆదివాసీ హక్కుల సభకు తొమ్మిది తెగల సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. సభకు ప్రతి ఆదివాసీ కుటుంబం నుంచి కనీసం ఒక్కరు హాజరయ్యేలా గ్రామస్థాయిలో కార్యాచరణ చేపట్టాలని సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.వాంకిడి మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో బుధవారం తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు పంద్రం సురేష్ అధ్యక్షతన చలో హైదరాబాద్ సన్నాహక సమావేశం నిర్వహించారు. తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపాతి అరుణ్‌కుమార్ ఆదేశాల మేరకు తొమ్మిది తెగల ఆదివాసీ సంఘాల నాయకులు సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. 2017లో సరూర్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమం కంటే అధిక సంఖ్యలో ఆదివాసీలు ఈసారి పాల్గొనేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

డిసెంబరు 9న చలో హైదరాబాద్

ఆదివాసీ హక్కుల సభకు తొమ్మిది తెగల మద్దతు

ప్రతి ఆదివాసీ కుటుంబం నుంచి ఒకరు తరలిరావాలి

ఆసిఫాబాద్ : ఆదివాసీల హక్కుల సాధన కోసం డిసెంబరు 9న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఆదివాసీ హక్కుల సభకు తొమ్మిది తెగల సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. సభకు ప్రతి ఆదివాసీ కుటుంబం నుంచి కనీసం ఒక్కరు హాజరయ్యేలా గ్రామస్థాయిలో కార్యాచరణ చేపట్టాలని సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.



అయ్యప్ప భక్తి నేపథ్యంలో వైభవ్ 'హరిహర పుత్ర'.. ఆకట్టుకుంటున్న టీజర్!

టాలెంటెడ్ హీరో వైభవ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'హరిహర పుత్ర' బ్లాక్‌బస్టర్ సినిమా 'మాళిగాపురం' ఫేమ్ విష్ణు శశి శంకర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. స్వామి అయ్యప్ప భక్తి, ఆధ్యాత్మికత మరియు ఉత్కంఠభరితమైన రహస్యాల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమా తెలుగు టీజర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ చిత్రంలో వైభవ్ పూర్తి భక్తిభావంతో కూడిన అయ్యప్ప భక్తుడిగా నటిస్తుండగా, ఆయన సరసన మీనాక్షి గోవిందరాజన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. వీరితో పాటు ఆడుకాలం నరేన్, అరవింద్ ఆకాష్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రంలో రవి మోహన్, మిర్చి శివ, వెంకట్ ప్రభు, కృష్ణ, మహత్, ప్రేమ్‌జీ అమరన్ మరియు గంగై అమరన్ వంటి ప్రముఖులు ప్రత్యేక పాత్రల్లో నటిస్తున్నారు. తంత్రా ఫిలింస్ పతాకంపై జె.కె. శరవణ, ఎం. రాజారామ్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ప్రముఖ దర్శకుడు వెంకట్ ప్రభు దీనికి క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాకు ప్రేమ్‌జీ అమరన్ సంగీతం అందిస్తుండగా, ప్రవీణ్ కె.ఎల్. ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.



బ్లాక్ డ్రెస్‌లో మౌనీ రాయ్ గ్లామర్ షో.. చూపు తిప్పుకోలేరు!

వయ్యారాలు ఒలకబోస్తున్న రకుల్.. క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో కట్టిపడేస్తున్న బ్యూటీ



విమర్శలను మోటివేషన్‌గా మార్చుకుంటున్నా దుల్కర్ సల్మాన్!



ప్రముఖ నటుడు దుల్కర్ సల్మాన్ ఆన్‌లైన్ నెగెటివిటీ, విమర్శలను ఎదుర్కొనే విధానంపై మరియు అవి తన కెరీర్ ఎంపికలపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయనే దానిపై తాజాగా స్పందించారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో తనను తీవ్రంగా కుంగదీసిన విమర్శలు ఇప్పుడు తనకు సులభంగా ఎదుర్కొనేలా మారాయని తెలిపారు. తన ఉద్దేశం ఎప్పుడూ మంచి సినిమాలు చేయడమేనని, ఎంత కష్టపడినా కొద్దిపాటి నెగెటివిటీ రావడం సహజమని ఆయన గ్రహించారు. అయితే, ఆ నెగెటివిటీని తానెప్పుడూ కక్షగా లేదా అసూయగా మార్చుకోలేదని, దాన్ని ఒక మోటివేషన్‌గా తీసుకుని తనని తాను నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తానని దుల్కర్ వెల్లడించారు. "కొంతమంది నేను ఒక పాత్ర చేయలేనని భావిస్తే, నేను దాన్ని సవాల్‌గా తీసుకుని చేయడానికి ప్రయత్నిస్తాను. భయపెట్టే లేదా సవాల్‌తో కూడిన పాత్రలను ఎంచుకోవడం వల్ల నటుడిగా నా ఎదుగుదల సాధ్యమైంది. ప్రస్తుతం నాలో ఎలాంటి కసి లేదా పగ లేదు" అని ఆయన భావోద్వేగంగా చెప్పుకొచ్చారు. మరోవైపు, పవన్ సాధినేని దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్ నటిస్తున్న తెలుగు డ్రామా చిత్రం 'ఆకాశంలో ఒక తార' నవంబర్ 20, 2026న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదే రోజున ఆయన తండ్రి, మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి నటించిన 'ఓ.ఎం: ఆపరేషన్ మోల్' కూడా విడుదలవుతుండటంతో, బాక్సాఫీస్ వద్ద తండ్రీకొడుకుల సినిమాల మధ్య ఆసక్తికరమైన పోటీ నెలకొంది.

తిరువీర్ కెరీర్‌లో ఆల్ టైమ్ బ్లాక్‌బస్టర్.. 'మసూద' సినిమాకు 4 ఏళ్లు!

టాలీవుడ్ వర్ధమాన నటుడు తిరువీర్ కెరీర్‌లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంచలనాత్మక హారర్ థ్రిల్లర్ 'మసూద' సాయికిరణ్ దర్శకత్వంలో రాహుల్ యాదవ్ నక్కా స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మించిన ఈ చిత్రం, ఎలాంటి భారీ అంచనాలు లేకుండా చిన్న సినిమాగా 2022 నవంబర్ 18న విడుదలై బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. అప్పట్లో ప్రేక్షకులను భయపెడుతూనే బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించిన ఈ సినిమా, తాజాగా విడుదలై నాలుగేళ్లు పూర్తి చేసుకుంది. ఈ చిత్రంలో కేవలం భయపెట్టే హారర్ సన్నివేశాలు మాత్రమే కాకుండా, ప్రేక్షకులను కట్టిపడేసే బలమైన భావోద్వేగాలు ఉండటంతో అన్ని వర్గాల ప్రేక్షకులు దీనికి కనెక్ట్ అయ్యారు. ఒక సాధారణ అమ్మాయి మసూద ఆత్మ ఆవహించడం, ఆమెను కాపాడుకునేందుకు తల్లి నీలం (సంగీత), పక్కనే ఉండే గోపి (తిరువీర్) చేసే ప్రయత్నాలు సినిమాను ఆద్యంతం ఉత్కంఠగా నడిపించాయి. తిరువీర్ సహజ నటనతో పాటు, కీలక పాత్రలో నటించిన నటి సంగీత అద్భుతమైన పెర్ఫార్మెన్స్ సినిమా విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి. అలాగే కావ్యా కల్యాణ్‌రామ్, శుభలేఖ సుధాకర్ తదితరుల నటన కూడా చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కినప్పటికీ, పకడ్బంది స్క్రీన్ ప్లే మరియు నేపథ్య సంగీతంతో ప్రేక్షకులకు సరికొత్త హారర్ అనుభూతిని పంచింది 'మసూద'. ఈ సినిమా ఘన విజయం తిరువీర్ కెరీర్‌ను మలుపు తిప్పడమే కాకుండా, టాలీవుడ్‌లో కొత్త తరహా హారర్-థ్రిల్లర్ జోనర్‌కు సరికొత్త ఊపునిచ్చింది. విడుదలై ఇన్ని ఏళ్లు గడుస్తున్నప్పటికీ, ఈ సినిమా అందించిన భయంతో కూడిన థ్రిల్ మాత్రం ప్రేక్షకుల మదిలో అలాగే నిలిచిపోయింది. మరోవైపు ఈ సినిమా సీక్వెల్ ఎప్పుడా అని ప్రేక్షకుల ఎదురుచూస్తున్నారు.

